APTEL/26/A4269

అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ మంగళవారం 14, జూలై 2026 సంపుటి: 01 సంచిక :47 పేజీలు : 04 వెల: 2-00/-



భారత యువ శాస్త్రవేత్తలకు ప్రధాని అభినందనలు

- భౌతిక శాస్త్ర ఒలింపియాడ్‌లో ఐదు స్వర్ణాలు
- యువత ప్రతిభపై ప్రధాని ప్రశంసలు
- విజ్ఞాన రంగంలో మరో ఘనత

న్యూఢిల్లీ, జూలై 13 : కొలంబియాలో నిర్వహించిన 56వ అంతర్జాతీయ భౌతిక శాస్త్ర ఒలింపియాడ్--2026లో స్వర్ణ పతకాలు సాధించిన భారత విద్యార్థులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. భారత యువత ప్రతిభకు ఈ విజయం నిదర్శనమని, విజ్ఞానశాస్త్రం, పరిశోధనల పట్ల వారి అంకితభావాన్ని ప్రపంచానికి చాటిందని ప్రశంసించారు. ఈ ప్రతిష్ఠాత్మక పోటీలో కనిష్క్ జైన్, రిద్ధేశ్ అనంత్ బెండాలే, రిషిత్ గర్గ్, శ్రేష్ఠ్ సురయ్యా, స్వరిత్ జోషి స్వర్ణ పతకాలు సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. వారి అసాధారణ ప్రతిభ భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు తీసుకొచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. భారత యువశక్తికి అపారమైన సామర్థ్యం ఉందని, సరైన అవకాశాలు లభిస్తే ప్రపంచ వేదికలపై అత్యుత్తమ విజయాలు సాధించగలరని మోదీ అన్నారు. విజ్ఞానశాస్త్రం, పరిశోధనలపై విద్యార్థులు చూపుతున్న ఆసక్తి దేశ భవిష్యత్తుకు శుభసూచకమని అభిప్రాయపడ్డారు. గత పదేళ్లుగా అంతర్జాతీయ భౌతిక శాస్త్ర ఒలింపియాడ్ సహా వివిధ అంతర్జాతీయ విజ్ఞాన పోటీల్లో భారత విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని ప్రధాని గుర్తుచేశారు. ఈ విజయ పరంపర దేశ విద్యా వ్యవస్థ, శిక్షణా విధానాల నాణ్యతను ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

పోలవరం పనులపై సీఎం సమీక్ష



- ప్రాజెక్టు పురోగతిని పరిశీలించిన చంద్రబాబు
- ప్రాధాన్య ప్రాజెక్టులు వేగవంతం చేయాలని ఆదేశం

ఏలూరు, జూలై 13 : రాష్ట్ర జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్పిల్‌వే నుంచి గోదావరి వరద నీటి ప్రవాహంతో పాటు ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య జరుగుతున్న నిర్మాణ పనులను విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. ప్రాజెక్టు పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టులోని ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాం గ్యాప్--1, గ్యాప్--2 పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. అలాగే విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణ పనుల పురోగతిని కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నిర్మాణ దశలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి అవసరాలను తీర్చే ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం పోలవరం పనులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న 36 ప్రాధాన్య నీటిపారుదల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొని తమ జిల్లాల్లోని ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. ప్రతి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

సాగునీటి ప్రాజెక్టులు రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తాయని చంద్రబాబు అన్నారు. రైతులకు సకాలంలో సాగునీరు అందేలా అన్ని ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని, నిధుల వినియోగం, నిర్మాణ నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రయోజనం చేకూరే అభివృద్ధి పనులకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ పర్యటనలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

పవన్‌ను పరామర్శించిన ఫడ్నవీస్

- భుజం శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్యంపై ఆరా
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



ముంబై, జూలై 13 : భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముంబైలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఫడ్నవీస్, వైద్యుల సూచనలను పాటిస్తూ పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కొద్దిసేపు పరస్పరం మాట్లాడుకున్నారు.

తన ఆరోగ్యం గురించి ప్రత్యేకంగా తెలుసుకోవడానికి వచ్చిన దేవేంద్ర ఫడ్నవీస్‌కు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తన త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షిస్తూ తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు తెలియజేశారు.

రాయలసీమ ఎత్తిపోతలపై వైసీపీ ఫోకస్



- ప్రాజెక్టు సాధనకు కార్యాచరణ ఖరారు
- ప్రభుత్వంపై వైసీపీ నేతల విమర్శలు

అమరావతి, జూలై 10 : దేవాదాయ శాఖ

నెల్లూరు, జూలై 13 : రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధన లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాచరణను ముమ్మరం చేసింది. పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులో సోమవారం రాయలసీమ ఎత్తిపోతల పథకం టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రాజెక్టు సాధన కోసం చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో పాటు వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు పాల్గొన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతానికి ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేసి రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. కృష్ణా నది జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టామని, ఆ ప్రాజెక్టును ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ కారణాలతో ముందుకు సాగనివ్వడం లేదని సమావేశంలో నాయకులు విమర్శించారు. ప్రాజెక్టు పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేసేలా వివిధ పరిణామాలు చోటుచేసుకున్నాయని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని నాయకులు ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రాజెక్టును వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు తిరిగి ప్రారంభించే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని కొనసాగించాలని సమావేశంలో తీర్మానించారు. రైతుల హక్కుల పరిరక్షణ, సాగునీటి అవసరాల సాధన కోసం ప్రజా ఉద్యమాలు చేపట్టడంతో పాటు కార్యాచరణను మరింత విస్తృతం చేయాలని పార్టీ నాయకులు నిర్ణయించారు.



అమరావతికి మరో 32.25 ఎకరాలు

- భూసమీకరణకు రైతుల స్వచ్ఛంద ముందడుగు
- సీఆర్డీఏకు అంగీకార పత్రాల అందజేత
- రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం కావడం ఆనందం

అమరావతి, జూలై 13 : ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి మరో 32.25 ఎకరాల భూమిని రైతులు స్వచ్ఛందంగా భూసమీకరణ పథకం కింద అందజేశారు. మందడం, వెంకటపాలెం, లింగాయపాలెం గ్రామాలకు చెందిన రైతులు సోమవారం రాయపూడిలోని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్డీఏ) ప్రధాన కార్యాలయంలో భూముల అప్పగింతకు సంబంధించిన అంగీకార పత్రాలను అధికారులకు అందజేశారు. మందడం, వెంకటపాలెం గ్రామాల పరిధిలోని 25.15 ఎకరాల భూమిని కట్టా బ్రహ్మవర్ధనరావు కుటుంబ సభ్యులు, లింగాయపాలెంకు చెందిన బడేటి ధర్మారావు 6.30 ఎకరాలు, మందడానికి చెందిన ఉన్నం నరహరి 0.80 ఎకరాల భూమిని భూసమీకరణ పథకానికి అందజేసేందుకు అంగీకరించారు. ఈ మేరకు సంబంధిత అంగీకార పత్రాలను ప్రత్యేక ఉప కలెక్టర్ ఎం. శేషిరెడ్డికి సీఆర్డీఏ అదనపు కమిషనర్ భర్గవతేజ సమక్షంలో అందజేశారు.

అనంతరం భూసమీకరణ ప్రక్రియలో భాగంగా రైతులు సంబంధిత అధికారులతో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. భూ సమీకరణ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేసిన అధికారులు, తదుపరి చర్యలను వేగవంతం చేస్తామని తెలిపారు. రాజధాని నిర్మాణానికి అవసరమైన భూముల సమీకరణను పారదర్శకంగా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రజారాజధాని అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని తెలిపారు.

15 నిమిషాల్లో బాలికను గుర్తించిన పోలీసులు



పెనుమూరు,జూలై 13(అనంత సూర్య):స్కూల్‌కు వెళ్లే క్రమంలో భయంతో ఒంటరిగా హోటల్ సమీపంలో కూర్చున్న 13 ఏళ్ల బాలికను కేవలం 15 నిమిషాల్లో సీసీ కెమెరాల సహాయంతో గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించిన పెనుమూరు పోలీసులను జిల్లా ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.పోలీసుల వివరాల ప్రకారం, పెనుమూరు మండలం చార్వగానిపల్లి గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని స్కూల్ బస్సు మిస్ కావడంతో ఆమె పిన్ని ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై పెనుమూరుకు పంపించింది. అయితే స్కూల్‌కు ఆలస్యంగా వెళితే ఉపాధ్యాయులు మందలిస్తారని, ఇంటికి తిరిగి వెళితే తల్లిదండ్రులు కోప్పడతారనే భయంతో బాలిక పెనుమూరులోని రెడ్డెమ్మ హోటల్ సమీపంలో ఒంటరిగా కూర్చుంది.ఉదయం 10.30 గంటలకు బాలిక స్కూల్‌కు రాకపోవడంతో పా–ఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించింది. వెంటనే వారు ఉదయం 10.45 గంటలకు పెనుమూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే పెనుమూరు ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కేవలం 15 నిమిషాల్లోనే బాలికను గుర్తించి ఉదయం 11 గంటలకు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

ఈ వేగవంతమైన స్పందనపై జిల్లా ఎస్పీ తుషార్ డూడి పెనుమూరు ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, “పిల్లల భద్రత పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యమైన బాధ్యత. చిన్నారులకు సంబంధించిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించడం మా కర్తవ్యం. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణతో పాటు కనిపించని వ్యక్తులను వేగంగా గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి” అని తెలిపారు.తల్లిదండ్రులు పిల్లలను గుర్తు తెలియని వ్యక్తులతో పంపకూడదని, పిల్లలకు ఇంటి చిరునామా, తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు గుర్తుండేలా చూడాలని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు.ప్రజలు తమ గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించి పోలీసు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని చిత్తూరు జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

99 శాతం డిజిటలైజేషన్ పూర్తి

చిత్తూరు,జూలై 13(అనంత సూర్య): జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై ఎన్నికల అధికారులు, రెవె–న్యూ సిబ్బంది, పర్యవేక్షణ అధికారులతో టెలీకాన్ఫ–రెన్స్ నిర్వహించిన కలెక్టర్, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు ఈ నెల 14తో ముగియనున్న నేపథ్యంలో మిగిలిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలో అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి, ఓటర్ల జాబితాను పారదర్శకంగా, ఖచ్చితంగా, సమగ్రంగా రూపొందించడమే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే జిల్లాలో శతశాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తికాగా, 99 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు.నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్ పురోగతి పరిశీలిస్తే నగరి -- 100 శాతం, జీడీ నెల్లూరు -- 99.82 శాతం, పూతలపట్టు -- 99.23 శాతం, పలమనేరు -- 99.57 శాతం, చిత్తూరు -- 97.96 శాతం, కుప్పం -- 97.42 శాతం పూర్తయినట్లు తెలిపారు.మిగిలిన వివరాలను కూడా నిర్దిష్ట గడువులోగా పూర్తిచేసేందుకు బూత్ లెవల్ అధికారులు, ఎన్నికల అధికారులు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఓటర్ల జాబితాలో ఖచ్చితత్వం, పారదర్శకత, సమగ్రత సాధించేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్న కలెక్టర్, ఇంటింటికీ వచ్చే బీఎల్ఓలకు ప్రజలు పూర్తి సహకారం అందించి తమ వివరాలను ధృవీకరించాలని విజ్ఞప్తి చేశారు.

గడువులోగా ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తి చేయాలి



ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్

చిత్తూరు,జూలై 13(అనంత సూర్య): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేసి, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పర్యటించిన ఆయన, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సోమవారం కాణిపాకం, చిన్నకాంపల్లి, కొత్తపల్లి, వడ్డేరామాపల్లి గ్రామాలతో పాటు చిత్తూరు నగరంలోని దొడ్డిపల్లి, గాయత్రినగర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎన్నికల సంఘం కార్యదర్శి, బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలించారు. బీఎల్ఓలతో మాట్లాడి ఎదురవుతున్న సమస్యలు, ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన ఓటరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. చిత్తూరు జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం సంతృప్తికరంగా సాగుతోందని పేర్కొన్నారు.అనంతరం ఐరాల మండలం చిన్నకాంపల్లిలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం కార్యదర్శి పర్యటన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించేందుకేనని తెలిపారు.జిల్లాలో ఇప్పటివరకు సుమారు 97 శాతం ఎస్ఎస్ఆర్ ప్రక్రియ పూర్తయిందని, ప్రస్తుతం దాదాపు 40 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిలో చాలా దరఖాస్తులను వెంటనే పరిష్కరించే అవకాశం ఉందని, మిగిలిన వాటిని అవసరమైన ధ్రువీకరణ అనంతరం పరిష్కరిస్తామని చెప్పారు. మిగిలిన మూడు శాతం పనులను కూడా రేపు మధ్యాహ్నం నాటికి పూర్తిచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.ఓటర్ల జాబితా సవ–రణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు ఎలాంటి ప్రధాన తప్పిదాలు లేదా గణనీయమైన ఫిర్యాదులు నమోదు కాలేదన్నారు. మరో రెండు రోజుల్లో మిగిలిన పనులను పూర్తి చేసి ఎన్నికల సంఘానికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు తెలిపారు.ప్రతి బీఎల్ఓకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామని, సేకరించలేని దరఖాస్తులు, మరణించిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, చిరునామా మార్చుకున్న వారు, ఇతర ప్రాంతాల్లో ఓటరుగా నమోదైన వారి వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా అందజేయనున్నట్లు చెప్పారు. దీంతో మొత్తం ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉంటుందన్నారు.”అర్హులైన ఒక్క ఓటరుని కూడా తొలగించే ప్రసక్తే లేదు” అని కలెక్టర్ స్పష్టం చేశారు. 2002 ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినా ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి, ఎన్యూమరేషన్ ఫారంతో కలిసి బీఎల్ఓకు అందజేస్తే సరిపోతుందని తెలిపారు. ఈ నెల 21న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తామని, అందులో పేరు లేకపోయినా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అవసరమైన ధ్రువపత్రాలు సమర్పిస్తే తుది ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేస్తామని వివరించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఈఆర్వో లేదా జిల్లా ఎన్నికల అధికారికి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ పి. నరసింహ ప్రసాద్, ఐరాల తహసీల్దార్, చిత్తూరు పట్టణ తహసీల్దార్, బూత్ లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వినతుల పరిష్కారంలో జాప్యం వద్దు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు,జూలై 13(అనంత సూర్య): ప్రజల నుంచి అందుతున్న వినతులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి వెంటనే డిస్పోజ్ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా జాప్యం సహించబోమని ఆయన స్పష్టం చేశారు.సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో కె. మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, ఏఓ బ్యూలా, ఈ–సెక్షన్ సూపరింటెండెంట్ శేషగిరిరావు, జిల్లా పరిషత్ సీఈవో రవి ప్రకాష్ నాయుడు, అదనపు సర్వే అధికారి జయరాజ్తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 281 వినతులు అందాయని, వాటిలో 227 వినతులు రెవెన్యూ శాఖకు సంబంధించినవేనని తెలిపారు. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రతి వినతిని నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రత్యేకంగా సమీక్షించి వెంటనే డిస్పోజ్ చేయాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. రీ–సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు వివాదాలు, భూ రికార్డులలోని తప్పులు, విస్తీర్ణ వ్యత్యాసాలపై రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యంతో పరిష్కరించాలని చెప్పారు. అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లోనే పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ 1100 టోల్‌ఫ్రీ సేవ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుదారుతో నేరుగా మాట్లాడిన తర్వాతే నివేదికలు సమర్పించాలని, మాట్లాడిన తేదీ, సమయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని చెప్పారు. ప్రజల్లో 1100 సేవలపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు.శాఖల వారీగా అందిన వినతుల్లో రెవె–న్యూ, సర్వే శాఖకు 227, డీఆర్డీఏకు 15, పశు సంవర్ధక శాఖకు 5, పోలీస్ శాఖకు 4, వ్యవసాయ శాఖకు 4, పంచాయతీరాజ్, ఏపీఎస్పీడీసీఎల్, మున్సిపల్ పరిపాలన, ఇరిగేషన్ శాఖలకు చెరో 3, సివిల్ సప్లై, వాటర్ రిసోర్సెస్, గృహ నిర్మాణ శాఖ, ఏపీఎస్ఆర్టీసీకి చెరో 2, భూగర్భ గనులు, బీసీ కార్పొరేషన్, ఉద్యాన శాఖ, ఐసీడీఎస్, పరిశ్రమల శాఖ, అటవీ శాఖలకు చెరో 1 వినతి అందినట్లు అధికారులు వెల్లడించారు.వినతుల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు.

క్షేత్రస్థాయిలో విచారించి ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి



చిత్తూరు,జూలై 13(అనంత సూర్య): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చిత్తూరు నగర పాలక సంస్థ కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కమిషనర్, గత వారం అందిన ఫిర్యాదుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ వారపు పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఇంజినీరింగ్ శాఖకు సంబంధించిన 6 వినతులు, రెవెన్యూ శాఖకు 1 వినతి, ప్రధాన కార్యాలయానికి 1 వినతి అందినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. లోకేష్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్లు నాగేంద్రతో పాటు నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం–పరిశుభ్రతపై పోస్టర్ల ఆవిష్కరణ



చిత్తూరు, జూలై 13(అనంత సూర్య): మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశు భ్రతపై అవగాహన కల్పించేందుకు సఖీ హబ్ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను సోమవారం చిత్తూరు నగరపాలక సంస్థ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.లోకేష్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డా. లోకేష్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇలాంటి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని సూచించారు.సఖీ హబ్ చిత్తూరు జిల్లా కోఆర్డినేటర్ బి. అరుణ కుమారి మాట్లాడుతూ, మహిళల ఆరోగ్య పరిరక్షణపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడమే సఖీ హబ్ ప్రధాన లక్ష్యమని చెప్పారు.ఈ కార్యక్రమంలో చిత్తూరు అర్బన్, రూరల్ మండల కోఆర్డినేటర్లు కల్పన, రాజేశ్వరి, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ కార్యదర్శి దొరస్వామి, మండల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేసిన ఎస్పీ



చిత్తూరు,జూలై 13(అనంత సూర్య): విధి నిర్వహణలో ఉండగా అనారోగ్యంతో మృతి చెందిన గుడిపాల పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.ఎస్. మురళి కుటుంబానికి చిత్తూరు జిల్లా పోలీసు శాఖ అండగా నిలిచింది. ఐడిఆర్ఎఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.1 లక్ష ఆర్థిక సఎ–యం చెక్కును జిల్లా ఎస్పీ తుషార్ డూడి సోమవారం జిల్లా సాయుధ దళం కార్యాలయంలో అందజేశారు.గత నెల జూన్ 11న గుడిపాల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం.ఎస్. మురళి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన సతీమణి ఎం. రేఖకు జిల్లా సా–యుధ దళం కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో ఐడీఆర్ఎఫ్ నిధి నుంచి మంజూరైన రూ.1 లక్ష చెక్కును ఎస్పీ అందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మృత పోలీసు ఉద్యోగి కుటుంబానికి పోలీసు శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అందించే అన్ని న్యాయమైన ఆర్థిక ప్రయోజనాలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాన్ క్యాడర్ ఎస్పీ (అడ్మిన్) ఎస్.ఆర్. రాజశేఖర్ రాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట మండలం శాయంపేటలో భారత్ పెట్రోల్ పంప్ ప్రారంభోత్సవం ఘనంగా

జమ్మికుంట, జులై 13, (అనంత సూర్య ప్రతినిధి) : జమ్మికుంట మండలం శాయంపేట గ్రామంలో బోయిని సమ్మయ్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ పెట్రోల్ పంప్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు, ప్రొఫెసర్ ఖాసీం, ఆర్టీఐ కమిషనర్ భూపాల్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ హాజరై పెట్రోల్ పంపును ప్రారంభించారు. అనంతరం వారు నిర్వాహకులు బోయిని సమ్మయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పెట్రోల్ పంప్ ద్వారా గ్రామ ప్రజలకు నాణ్యమైన ఇంధన సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గ్యాస్ సిలిండర్ ప్రమాదంలో గాయపడిన సాక్షి బాబును పరామర్శించిన ఏపీడబ్ల్యూజేఎఫ్ ఏపీబీజేఏ సంఘాల నాయకులు

ఇబ్రహీంపట్నం, జులై 13, (అనంత సూర్య ప్రతినిధి): గ్యాస్ సిలిండర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఇబ్రహీంపట్నం మండలం సీనియర్ రిపోర్టర్ సాక్షి అవుటి బాబును ఏపీడబ్ల్యూజేఎఫ్ – ఏపీబిజెఏ జిల్లా నాయకులుపరామర్శించారు.కొండపల్లి మోహనరావు మెమోరియల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న అవుటి బాబును ఏపీబిజెఏ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీనియర్ రిపోర్టర్ రాఘువులు,కంచికచర్ల సాక్షి రిపోర్టర్ బొక్క ప్రభాకర్, వీరులపాడు సాక్షి రిపోర్టర్ రవి కుమార్ కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాబు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. జర్నలిస్టు కుటుంబానికి అవసరమైన అన్ని విధాలా అండగా ఉంటామనిహామీఇచ్చారు.ప్రమాదంలో గాయపడిన అవుటి బాబు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



వైసిపి నాయకుడు బేగ్ కు మాజీ మంత్రి జోగి రమేష్ ఘన నివాళి

ఇబ్రహీంపట్నం,జులై13,(అనంత సూర్య ప్రతినిధి): కొండపల్లి మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ షీనాబేగం భర్త వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బేగ్ ఆకస్మిక మరణం పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కొండపల్లిలో బేగ్ పార్థివ దేహానికి మాజీ మంత్రి మైలవరం నియోజకవర్గ సమన్వయ కర్త జోగి రమేష్ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మృతదేహం వద్ద కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జోగి-రమేష్,మాట్లాడుతూ బేగ్ తనకు సోదర సమానుడని తెలిపారు.ఎప్పుడూ చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరించే కల్మషంలేనివ్యక్తిఅనికొనియాడారు.గత కొన్ని దశాబ్దాలుగా పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారంలో బేగ్ ముందుండి పని చేశారని గుర్తు చేశారు.అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండే వ్యక్తి అని ప్రశంసించారు.బేగ్ మరణం పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. బేగ్ కుటుంబానికి వైసిపి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.






కొడారి రమేష్‌పై వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం వాస్తవాలు వెల్లడించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

ఇల్లంతకుంట, జులై 13, (అనంత సూర్య ప్రతినిధి) : ఇల్లందకుంట,మండలంలోనిపాతర్లపల్లి గ్రామంలోఇటీవల కొడారి ఐలు కొమురయ్య-ఓదెమ్మల కుమారుడు రమేష్‌పై మీడియాలో మరియు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా వాస్తవ దూరం మరియు అసత్యమని రమేష్ తరపున కుటుంబ సభ్యులు తీవ్రంగా ఖండించారు. తన పరువు ప్రతిష్ఠలను భంగపరిచేందుకు కొందరు గిట్టని వ్యక్తులు చేస్తున్న కుట్రలో భాగమే ఈ దుష్ప్రచారమని వారు స్పష్టం చేశారు. ఈ వివాదానికి సంబంధించిన అసలు నిజాలు మరియు భూమి వివరాలను పత్రాలతో సహా బహిర్గతం చేశారు.కొడుకు ఆస్తి కోసం తల్లిదండ్రులను వేధిస్తున్నాడనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. మొత్తం 4 ఎకరాల 20 గుంటల భూమి ఇప్పటికీ పూర్తిగా తండ్రి ఐలు కొమురయ్య పేరుపైనే రిజిస్టర్ అయి ఉంది. కుమారుడైన రమేష్ పేరిట ఒక్క గుంట భూమి కూడా లేదు. అలాంటప్పుడు ఆస్తి కోసం తండ్రిని ఇబ్బంది పెడుతున్నాడనడం కేవలం బురదజల్లే ప్రయత్నం మాత్రమేనని రమేష్‌పై వ్యక్తిగత కక్షలు, ద్వేషం ఉన్న కొందరు స్థానిక వ్యక్తులు ఈ పరిస్థితిని ఆసరాగాచేసుకున్నారు.కొమురయ్యకు లేనిపోని మాటలు చెప్పి సపోర్ట్ చేస్తున్నట్లు నటిస్తూ,కావాలనే వారి చేత భిక్షాటన చేస్తున్నట్లు ఫోటోలు తీయించారు. ఆ ఫోటోలను మీడియాకు చేరవేసి, ఒక పద్ధతి ప్రకారం అసత్య ప్రచారాలు చేయిస్తూన్నారని రమేష్ తెలిపారు.



ఓటు బ్యాంకుగా వడ్డెర్లు.. రాజకీయ పదవుల్లో ఎందుకు వెనుకబాటు?



అనంతపురం, జూలై 13 అనంత సూర్య : ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం, ఉమ్మడి అనంతపురం జిల్లా ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వడ్డెర సమాజ రాజకీయ భవిష్యత్తుపై విస్తృత స్థాయి చర్చ జరిగింది. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వర్గాల్లో ఒకటైన వడ్డెర సమాజానికి రాజకీయంగా తగిన గుర్తింపు, ప్రాతినిధ్యం కల్పించాలని నాయకులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. ముఖ్యంగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవిని వడ్డెర సమాజానికి కేటాయించాలని, వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని, రాష్ట్ర కార్పొరేషన్లలో చైర్మన్ పదవులు, నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల మురళి, హిందూపూర్ పార్లమెంట్ టీడీపీ మాజీ అధ్యక్షుడు కొల్లకుంట వడ్డే అంజినప్ప, మల్లెల జయరాం, ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు కుంచపు వెంకటేష్, టీడీపీ ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమప్ప మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా వడ్డెర సమాజానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవిని వడ్డెరలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే రాబోయే రోజుల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగితే వడ్డెర సమాజంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముందని హెచ్చరించారు. వడ్డెరల రాజకీయ హక్కుల సాధన కోసం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10 వేల మంది వడ్డెరలతో భారీ బహిరంగ సభ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో శ్రీ సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు, గోరంట్ల మండల వడ్డెర సంఘం సీనియర్ నాయకుడు, మార్కెట్ యార్డు డైరెక్టర్ వడ్డే అమర్నాథ్, వడ్డే రామాంజనేయులు, పెనుకొండ మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు వడ్డే యల్లప్ప, అనంతపురం వడ్డెర సంఘం యూత్ అధ్యక్షుడు వడ్డే నాగార్జున, పెనుకొండ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పల్లవరాజు, పరిగి వడ్డే గిరీష్, ఉమ్మడి అనంతపురం జిల్లా వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం చివరలో "వడ్డెరలకు రాజకీయ న్యాయం చేయాలి.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ వెంటనే కేటాయించాలి" అనే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతికి నిర్దేశిత గడువులో పరిష్కారం చూపాలి – జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం జులై13,(అనంత సూర్య ప్రతినిధి) :సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసతులు, సామాజిక భద్రతతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి, నిర్దేశిత గడువులో పరిష్కారం చూపాలని ఆదేశించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన వినతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని కేవలం నమోదు చేయడమే కాకుండా, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి ఫలితాలు కనిపించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో వ్యవహరిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు.
ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతతోవ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డినిమర్యాదపూర్వకంగాకలిసిన - జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం జులై 13,(అనంత సూర్య ప్రతినిధి) : సింగరేణి భరోసా యాత్రలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని సోమవారం ఇల్లందు క్రాస్ రోడ్‌లోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డికి మొక్కను అందజేసి జిల్లా యంత్రాంగం తరఫున ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలపై స్వల్పంగా చర్చించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వర్షం లేక పంటలు ఎండిపోతున్నాయి



నందిగామ జులై 13, (అనంత సూర్య ప్రతినిధి): ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలో ఈ ఏడాది వర్షాలు అత్యల్పంగా నమోదయ్యాయి. గత 12 రోజులుగా తీవ్రమైన ఎండలు, వడగాలులతో పంటలు ఎండు ముఖం పట్టాయి. ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతన్నల కళ్లలో నీళ్లు తప్ప వర్షపుచినుకులులేవు. పెసర,మినుము, మొక్కజొన్న, ప్రత్తి, వరి నారు మడులు నాటిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా నారుమడులు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.ఒకరైతుఆవేదన:ఆరుగాలం కష్టపడి పండిస్తాం. కానీ వర్షం లేక అంతా బూడిదలో పోసిన పన్నీరయ్యింది.దేవుడి మీద భారం వేసి పంటలు వేశాం.ఇప్పుడు అవి కూడా దక్కేలా లేవు" అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొన్ని చోట్ల పొలాల వద్ద నీరు లేకపోవడంతో రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి పంటలకు పోస్తున్నారు. పురుగుమందులు పిచికారి చేసినా పంటలు కాపాడుకునే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.ఎల్ నినో ప్రభావంతో తక్కువ రోజుల వ్యవధి గల పంటలు వేసుకోవాలని వ్యవసాయాధికారులు ముందే సూచించారు. అయినప్పటికీ రైతులు ధైర్యం చేసి సాగు చేపట్టారు. ఈ ఏడాది వర్షాకాల పరిస్థితులు రైతులకు అనుకూలించడం లేదని వాస్తవ రూపంలో కనిపిస్తోంది. వరుణుడి కటాక్షం కోసం నందిగామ రైతులు ఇంకా ఎదురుచూస్తున్నారు.

జాతీయ నలిపురుగుల నిర్మూలన దినోత్సవం



హుజురాబాద్, జూలై 13 (అనంత సూర్య ప్రతినిధి) : హుజురాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో సోమవారం జాతీయ నలిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి, నలిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు హాజరై విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఒక చిన్న మాత్ర... పిల్లల ఆరోగ్యానికి గొప్ప రక్షణ" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ప్రతి చిన్నారి నలిపురుగుల నివారణ మాత్ర తీసుకోవడం వారి హక్కు, ప్రతి తల్లిదండ్రులు పిల్లలకు తప్పనిసరిగా ఈ మాత్ర వేయించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ మాత్రలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీటీసీఓ హిమబిందు, డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రభుదాస్,పాఠశాలప్రధానోపాధ్యాయులు తిరుమల, సీడీపీఓ సుగుణ, కౌన్సిలర్లనునీత,శ్రీలేఖ,వైద్యసిబ్బంది,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. జాతీయ నలిపురుగుల నిర్మూలన దినం నిర్వహించడం జరిగింది.

కాశీ-ప్రయాగరాజ్ అయోధ్య యాత్ర ముగించుకొని వచ్చిన యాత్రికులకు ఘనస్వాగతం



హిందూపురం, జూలై 13 అనంత సూర్య : కాశీ, ప్రయాగరాజ్, అయోధ్య పుణ్యక్షేత్రాల యాత్రను విజయవంతంగా ముగించుకొని హిందూపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న యాత్రికులకు ఘన స్వాగతం లభించింది. తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బి.వి. అరుణ్ కుమార్ రెడ్డి, జయనగర విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఉపాధ్యక్షురాలు పద్మా చిన్నపరెడ్డి యాత్రికులను పూలమాలలతో సాదరంగా ఆహ్వానించి అభినందించారు. సుమారు 80 మంది భక్తులు ఈ పుణ్యయాత్రలో పాల్గొనగా, యాత్ర ప్రారంభం నుంచి ముగింపు వరకు వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించినట్లు యాత్రికులు తెలిపారు. కాశీ విశ్వనాథ్, ప్రయాగరాజ్ త్రివేణి సంగమం, అయోధ్య శ్రీరామ జన్మభూమి వంటి పవిత్ర క్షేత్రాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దైవ దర్శనాలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని పేర్కొన్నారు. యాత్రికుల వసతి, భోజనాలు, రవాణా తదితర అన్ని ఏర్పాట్లను సమన్వయం చేస్తూ యాత్ర విజయవంతంగా పూర్తయ్యేలా బి.వి. అరుణ్ కుమార్ రెడ్డి, పద్మా చిన్నపరెడ్డి విశేష కృషి చేశారని భక్తులు కొనియాడారు. వారి సేవాభావం వల్ల యాత్ర ప్రశాంతంగా, భక్తిశ్రద్ధల నడుమ ముగిసిందని తెలిపారు. ఈ సందర్భంగా యాత్రికులు మాట్లాడుతూ, యాత్రను విజయవంతంగా నిర్వహించి తమకు చిరస్మరణీయ ఆధ్యాత్మిక అనుభూతిని అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పుణ్యయాత్రలను మరింత మంది భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. హిందూపురం రైల్వే స్టేషన్‌లో యాత్రికులకు ఘన స్వాగతం పలికిన సందర్భంగా కుటుంబ సభ్యులు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.





ప్రెస్‌క్లబ్ పరిరక్షణ కోసం..

2వ రోజు జర్నలిస్టుల వినూత్న నిరసన

- దిష్టిబొమ్మకు ఆక్సిజన్, సెలైన్ ఎక్కించి అర్ధనాదాలు
- కలెక్టర్ స్పందించాలంటూ వేడుకోలు
- దీక్షలకు మద్దతుగా తరలివస్తున్న ప్రజా, కుల, విద్యార్థి, సీనియర్ పాత్రికేయులు
- నేడు ఉదృత ఆందోళనలకు భవిష్యత్ కార్యాచరణ



అనంతపురం, జులై 13 అనంతసూర్య :

అనంతపురం ప్రెస్‌క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించాలంటూ పలువురు యువ, సీనియర్ జర్నలిస్టులు ప్రెస్‌క్లబ్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. రిలే దీక్షలో.. చెరుకూరి రామాంజనేయులు, రామ్మూర్తి, కుంచెపు భాస్కర్, సీ.హరికృష్ణ, వై.కుళ్ళాయప్ప, షాకీర్, రామకృష్ణ, కుంచెపు రవి, పరంధామ, మూర్తి తదితరులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రెస్‌క్లబ్ ఎన్నికల నిర్వహణ పట్ల తాత్సరం వహిస్తున్న కమిటీ సభ్యులకు కనువిప్పు కలిగేలా.. ఓ దిష్టిబొమ్మకు ప్రెస్‌క్లబ్ నామకరణ చేసి మంచంపై పండుకోబెట్టి.. సెలైన్, ఆక్సిజన్ పెట్టి మరి ప్రెస్‌క్లబ్ పరిస్థితిని వర్ణించారు. ఎన్నికలు జరగని కారణంగా ప్రెస్‌క్లబ్‌కు నిజమైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కమిటీ సభ్యులు లేరని, తద్వారా ప్రెస్‌క్లబ్ అభివృద్ధి కుంటుపడడమే కాకుండా, ఆపద సమయంలో ఉన్న అర్హులైన జర్నలిస్టులకు ఫలాలు అందక దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఇచ్చిన అవకాశాన్ని వమ్ము కాకుండా కమిటీ సభ్యులు, డీసీఎంఎస్ అధికారుల సహకారంతో తక్షణం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు సహకరించని, రిలే దీక్షలకు మద్దతు ఇవ్వని సంఘాలతోను, కమిటీ సభ్యులతోను ఇక తాడోపేడో తేల్చుకుంటామని సూచనప్రాయంగా తెలియజేశారు. హడ్ హక్ కమిటీలోని కొందరు ఎన్నికల పట్ల తమకు ఆసక్తి లేదని చెబుతున్నప్పటికీ వారి వారి తాత్కాలిక పదవులకు రిజైన్ చేయని కారణంగా ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. హడ్ హక్ కమిటీకి సంబంధించిన సమావేశాల్లో వరుసగా మూడు మీటింగులకు రాని వారిని స్వచ్ఛందంగా తొలగించే వెసులుబాటు ఉన్నప్పటికీ, మూడింటిలో ఒకదానికి హాజరై తమ నిర్ణయం చెప్పకుండా వెళ్ళిపోతున్న వారు కూడా లేకపోలేదని విమర్శించారు. ఇప్పటికైనా వారి వారి వైఖరిని ఈ రిలే దీక్షలో స్పష్టంగా తెలియజేసి, ఎన్నికల పట్ల ఆసక్తి లేకపోతే కమిటీకి స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని రిలే దీక్షలో కూర్చున్న ఆందోళనకారులు డిమాండ్ చేశారు. మూడవ రోజు మంగళవారం కూడా ప్రెస్‌క్లబ్ ఎదుట రిలే దీక్ష జరుగుతుందని, ఎన్నికల నిర్వహణ పట్ల స్పష్టత ఇవ్వని, దాపరికం చేష్టలు చేస్తున్న కమిటీ సభ్యుల దిష్టిబొమ్మలను కాల్చి వారి ఇంటి వద్ద ఆందోళన చేసేందుకు కూడా వెనకడుగు వేయమని స్పష్టంగా దీక్షలో కూర్చున్న పలువురు జర్నలిస్టులు తెలియజేశారు.

దీక్షకు మద్దతు తెలిపిన వారిలో.. సీనియర్ పాత్రికేయులు ఆజాద్, ప్రముఖ న్యాయవాది సాకే నరేష్, బీసీ సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు భాస్కర్ బాబు, ఏఐఎస్ఎఫ్ కుల్లాయిస్వామి, బీసీవై పార్టీ నాయకులు బీసీ సురేష్ యాదవ్, బుక్కరాయసముద్రం మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, రిటైర్డ్ మున్సిపల్ ఉద్యోగి ఏసీబీ శ్రీనివాసులు, సీపీఐ జాఫర్, ఎస్సీ నాయకులు మద్దెలచెర్వు మల్లి, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.










నర్సరీకి 70 వేల ఫీజులా.. !

- ట్రిలిస్ విద్యా సంస్థ వద్ద విద్యార్థి నేతల ధర్నా





అనంతపురం, జూలై 13 అనంత సూర్య : అనంత నగరం నడిబొడ్డున ఉన్న ట్రేలిస్ స్కూల్లో నర్సరీ, యూకేజీ,ఎల్కేజీ విద్యార్థులకు 70 వేల నుంచి 80 వేల రూపాయల వరకు ఫీజులు దండుకుంటున్నారని ఆరోపిస్తూ ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నేతలు ట్రేలిస్ స్కూల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ మాట్లాడుతూ.. భారత దేశంలో ఎక్కడ లేని విధంగా కరువు జిల్లాలో కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థలు వీళ్ళకు వేల రూపాయలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ట్రేలిస్ స్కూల్ లో అయితే పాఠ్యపుస్తకాల పేరుతో ఎనిమిది పుస్తకాలు ఇచ్చి 4200 వందల రూపాయలను ఫీజు కట్టించుకొని ఆ పుస్తకాలను టవర్ క్లాక్ వద్ద ఉన్న జ్యోతి బుక్ స్టాల్ లో విక్రయించడం జరుగుతుందని, తాము స్వయంగా వెళ్లి పుస్తకాల పేరుతో ఉన్న పేపర్ను చూపిస్తే తమ సంబంధం లేదని, లేనిపోని సమాధానం చెబుతున్నారన్నారు. మార్కెట్ కంటే 3, 4 రేట్లు అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బయట దొరకని విధంగా ప్రత్యేకంగా పబ్లిషర్స్ పుస్తకం ప్రవేశపెట్టి విద్యా వ్యాపారానికి తెల లేపుతున్నారు. ట్రేలిస్ విద్యాసంస్థలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూ, బ్లేజర్ వంటి వస్తువులు అమ్ముతున్నారని ఇన్చార్జి డి ఈ ఓ కి ఫోన్లో ఫిర్యాదు చేయగా.. తాము వస్తున్నామని చెప్పి, రెండు గంటలు ధర్నా నిర్వహించిన ఏ విద్యాశాఖ అధికారి కూడా ట్రేలిస్ స్కూల్ వైపు కన్నెత్తి చూడలేదన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థలు ఇస్తున్న మామూలు మత్తులో మునిగి తేలుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నార న్నారు. కాలం చెందిన బిల్డింగులు స్కూల్ నడుపుతూ విద్యను వ్యాపార ధ్యేయంగా మూడు పూలు ఆరు కాయలు లాగా ఇటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతుందని ఎద్దేవా చేశారు. డి ఈ ఓ స్పందించకపోతే కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలియజేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ ధర్నాలో రాష్ట్ర కార్యదర్శులు సతీష్ చౌదరి, వెలుగు ప్రశాంత్, జిల్లా కార్యదర్శిలు విజయ్, రాజేష్, పోలార్డ్ నరేష్,చంద్ర రెడ్డి, కౌండిన్య, ప్రదీప్, ప్రభంజన్ రెడ్డి, సింహాద్రి, గోవర్ధన్, గోవింద్, తదితర విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.



- మనీ మత్తు వీడని విద్యాశాఖ అధికారులు
- కళ్ళముందే తప్పుడు పనులు.. కనికరం చూపిస్తున్న దౌర్భాగ్యం
- ఆ లోన కోచింగ్.. విద్యార్థినీ విద్యార్థి నిరుద్యోగులకు మానసిక ఒత్తిళ్లు
- ఏపీలోనే ఎక్కడా లేనివిధంగా వన్ టూ ఇంటర్ గురుకులం

గురుకుల పేరుతో.. గోపిలోల కాసుల గమ్మత్తు !

అనంతపురం, జులై 13 అనంత సూర్య :

హతవిధీ.. అనంతపురం జిల్లా విద్యాశాఖలో ఇదో కర్మ సిద్ధాంతం. ఏపీలోనే ఎక్కడా లేనివిధంగా అవినీతి రాజ్యమేలుతోంది. జిల్లా విద్యాశాఖ అధికారి లేకపోవడంతో ఇన్చార్జిగా పూర్తి బాధ్యతలు చేపట్టిన మారుపేరు **'బంగారు బుల్లోడు'** ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. కళ్ళముందే తప్పు చేస్తున్నారని తెలిసినా.. ఇసుమంతైన చర్యలు తీసుకోకపోగా అందు నుండి కూడా కాసుల కక్కుర్తి పడుతున్నారని తెలుస్తుంది. ఉదాహరణకు జులై 11న **'అనంత సూర్య'** దినపత్రిక ప్రముఖంగా ఒక కథనాన్ని ప్రచురించింది. విద్యా వ్యవస్థ నిద్రావస్థలో అంటూనే.. **'గురుకుల్ కిల్ కిల్'** జరుగుతుందని రాసింది. అది కూడా ప్రైవేట్ గురుకుల పాఠశాల డాక్టర్ గోపికృష్ణ గురుకుల్ అంటా.. వన్ టూ టెన్ ప్లస్ టూ వరకు నిర్వహిస్తూ ఉండడం విశేషం. అనుమతి లేకుండానే హాస్టల్ వసతి కూడా నిర్వహిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి 7వ తరగతి వరకు ఒక రకమైన అనుమతి తీసుకుని ఇంటర్మీడియట్ వరకు అక్కడ నిర్వహిస్తు ఉండడం విశేషం. ఇదే విషయాన్ని గత కథనంలో కూడా స్పష్టంగా ఆధారాలతో తెలియజేశాం. ఇక్కడ మరో కొసమెరుపు ఏమిటంటే.. ఆ పాఠశాలలోని ప్రాంగణంలో ఓ కోచింగ్ సెంటర్ కూడా భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ నిర్వహణ ఎలా ఉంటుందంటే.. పలు కళాశాలలకు సంబంధించిన విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు, అది కూడా కళాశాలల నిర్వహణ సమయంలో కావడం విశేషం. పక్కా కమిట్‌మెంట్‌తో పలు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యంతో మాట్లాడుకుని.. అక్కడ విద్యార్థులు విద్యను అభ్యసించకుండా ఇతర కళాశాలలో శిక్షణ పొందుతున్న వారికి మరోచోట టీసీలు, మార్క్స్ కార్డులు పొందుతూ ఉండటం విశేషం.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405